


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




ఆదివారం 28-06-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :11 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## ‘నాకు ఏం జరిగినా రేవంత్ రెడ్డిదే బాధ్యత’

### ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు


2 లో

- భద్రత తొలగింపుపై ఆగ్రహం
- ప్రజల కోసమే నా పోరాటం
- ప్రభుత్వం టార్గెట్ చేసిందన్న ఆరోపణ
- రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ

**న్యూస్ డెస్క్, 27 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తనపై కక్షగట్టి వేధిస్తోందని ఆయన ఆరోపించారు. శనివారం మీడియా ముఖంగా ఆయన మాట్లాడిన పలు వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## ఆ ప్రచారం నమ్మొద్దు

### ఆర్టీసీ హామీలపై మంత్రి పొన్నం కీలక ప్రకటన

- 14 గంటల సుదీర్ఘ చర్చలు
- 32 డిమాండ్లపై ఏకాభిప్రాయం
- జూలై నుంచి 11% పీఆర్సీ అమలు
- గుర్తింపు సంఘాల ఎన్నికలపై స్పష్టత
- విలీన కమిటీలో కార్మికులకు చోటు


2 లో

**న్యూస్ డెస్క్, 27 జూన్ (ఇది కద నిజం):** ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఈ మేరకు కార్మిక సంఘాల డిమాండ్లు, ఆర్టీసీ విలీన ప్రక్రియపై మంత్రి శనివారం ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుతో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున...

## కలపడం తప్పు.. విడగొట్టడం రాదు

### కుల రాజకీయాలపై పవన్ కీలక వ్యాఖ్యలు


2 లో

- ఒకే హాస్టల్ ఉండాలన్న ఆకాంక్ష
- పని చేసిన వారికే పదవులు
- పార్టీ కోసం నిస్వార్థ సేవకు గుర్తింపు

**న్యూస్ డెస్క్, 27 జూన్ (ఇది కద నిజం):** తనకు కలపడం తప్పు విడగొట్టడంరాదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార కమిటీ కార్యచరణ సమావేశంలో పాల్గొన్న ఆయన తాను కుల రాజకీయాలు చేస్తున్నారని వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలపై ఆయన స్పందించారు.

## మోడీ ప్రభుత్వంపై సోనియా గాంధీ తీవ్ర విమర్శలు

- గాజాపై కేంద్రం మౌనమంటూ విమర్శ
- విదేశాంగ విధానంపై అభ్యంతరం
- చారిత్రాత్మక మిత్రదేశాల ప్రస్తావన
- పాకిస్తాన్‌కు అవకాశం ఇచ్చారన్న ఆరోపణ
- ఇజ్రాయెల్ పర్యటనపై ప్రశ్నలు


2 లో

## వారి త్యాగం చిరస్మరణీయం

### పునరావాసం కల్పిస్తాం: సీఎం చంద్రబాబు

- ఫీడర్ కెనాల్ పనుల పరిశీలన
- నాలుగు జిల్లాల భవిష్యత్తు మారుతుంది
- ఎన్టీఆర్ కలను గుర్తు చేసిన సీఎం
- పునరావాసానికి రూ.300 కోట్లు


2 లో

## ‘స్మార్ట్ కిచెన్’ పేరుతో మధ్యాహ్న భోజన కార్మికుల పొట్ట కొడుతున్నారు: వైఎస్ జగన్

- 85 వేల మహిళల జీవితాలపై ఆందోళన
- కాంట్రాక్టులపై తీవ్ర ఆరోపణలు
- రెండు నెలల వేతనాలు బకాయి
- జీతాలు పెంచాలని డిమాండ్
- కార్మికుల పక్షాన పోరాటం కొనసాగుతుంది

2 లో

## ఉపాధి చట్టంపై తెలంగాణ నిర్ణయం

**న్యూస్ డెస్క్, 27 జూన్ (ఇది కద నిజం):** గ్రామీణ పేదల జీవనోపాధికి వెన్నెముకగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, రాష్ట్రాల అధికారాలను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వీబీ-జీ రామ్-జీ చట్టం--2025ను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ యథాతథంగా అంగీకరించబోదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన రెండో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, గడ్డం వివేక్ వెంకటస్వామి, పంచాయతీ రాజ్ ప్రత్యేక కార్యదర్శి దానకిశోర్, పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ డి.దివ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు.. ఇది కేవలం ఉపాధి హామీ చట్టం సవరణ కాదని, భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిపైనే జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని తీవ్రంగా విమర్శించారు.

**సుప్రీంకోర్టు వరకు వెళ్తాం:**

రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను క్రమంగా కేంద్రీకరించి, గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని ఆయన ఆరోపించారు.


మిగతావి 2 లో..

- కేంద్ర ప్రతిపాదనకు తెలంగాణ నో
- రాష్ట్ర హక్కులపై దాడి: ఉత్తమ్
- అవసరమైతే సుప్రీంకోర్టుకు
- తెలంగాణకు ప్రత్యేక చట్టం?
- 200 రోజుల ఉపాధికి డిమాండ్
- ఇతర రాష్ట్రాలతో ఉమ్మడి పోరాటం
- నిధుల విధానంపై తీవ్ర అభ్యంతరం
- జూలై 2న కేబినెట్‌లో తుది నిర్ణయం

## మహిళా రిజర్వేషన్ల కోసం మహాసభ

### తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత

**న్యూస్ డెస్క్, 27 జూన్ (ఇది కద నిజం):** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ మహిళా మహాసభ నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. శనివారం ఎన్‌సీఆర్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లో నిర్వహించిన చట్టసభల్లో మహిళా రిజర్వేషన్స్ సాధన సభలో పాల్గొని ఆమె ప్రసంగించారు.


2 లో


## సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో కీలక పరిణామం



- సిట్ అదుపులో సీఐ మిత్రుడు సురేష్.. పరారీలో పోలీసులు!

2 లో

## వెనిజులా భూకంపంలో షాకింగ్ నిజాలు


2 లో

- 51 వేల మంది మిస్సింగ్!
- 920 మందికి పైగా మృతి
- రాత్రింబవళ్లు సహాయక చర్యలు
- ప్రాణాలతో బయటపడే ఆశ తగ్గుతోంది
- వెనిజులాలో అత్యవసర పరిస్థితి

**న్యూస్ డెస్క్, 27 జూన్ (ఇది కద నిజం):** దక్షిణ అమెరికా దేశం వెనిజులాలో ఈ నెల 24న వరుసగా రెండు భారీ భూకంపాలు సంభవించాయి. ఈ జంట భూకంపాలు సృష్టించిన బీభత్సం కారణంగా నేటికి సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు 920 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక ప్రభుత్వం అధికారికంగా ప్రకటించగా.. షాకింగ్ నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. భూకంపం సంభవించి మూడు రోజులు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఈ ఘోర ప్రకృతి విపత్తు కారణంగా వందలాది భవనాలు, అపార్టుమెంట్లు కుప్పకూలాయి.

## తెలంగాణ సీఎంవోలో మరో వికెట్ అవుట్

### నిన్న అజిత్ రెడ్డి, నేడు శ్రీనివాస్ రాజు


2 లో

- ప్రిన్సిపల్ సెక్రటరీకి బదిలీ
- రెరా చైర్మన్‌గా నియామకం
- బ్యూరోక్రాటిక్ వర్గాల్లో చర్చ
- మరిన్ని మార్పులపై ఊహాగానాలు

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 28-06-2026

## 'నాకు ఏం జరిగినా రేవంత్ రెడ్డిదే బాధ్యత' ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ప్రజా సమస్యలపై నిరంతరం గొంతెత్తుతూ, విపక్ష నేతగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే తనను అధికార పక్షం టార్గెట్ చేసిందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ప్రజల పక్షాన నిలబడటమే తాను చేసిన తప్పా అని ఆయన ప్రశ్నించారు. తనకు కనీస ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ప్రభుత్వం భద్రతను (సెక్యూరిటీ) తొలగించిందని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక మాజీ ఉన్నతాధికారిగా, ప్రజా ప్రతినిధిగా ఉన్న తనకు రక్షణ లేకుండా చేయడం వెనుక ఉన్న అంతరార్థం ఏంటని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఆయన సీఎం రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేస్తూ.... "నాకు భవిష్యత్తులో ఏం జరిగినా, నా ప్రాణానికి ఏ హాని తలపెట్టినా దానికి ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే పూర్తి బాధ్యత" అని స్పష్టం చేశారు.

అంతా ప్రజల కోసమే: ఆర్ఎస్పీ

తాను చేస్తున్న పోరాటాల వెనుక ఎటువంటి వ్యక్తిగత స్వార్థం లేదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తేల్చి చెప్పారు. "నేను ఏం చేసినా, ఏ నిర్ణయం తీసుకున్నా అది కేవలం ప్రజల కోసమే. నాకంటూ ఎలాంటి సొంత ఎజెండాలు లేవు" అని ఆయన పేర్కొన్నారు. భద్రతను తొలగించినంత మాత్రాన భయపడేది లేదని, ప్రజల తరపున తన గొంతుక మరింత బలంగా వినబడుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై బీఆర్ఎస్ శ్రేణులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంతో, ఈ సెక్యూరిటీ ఉపసంహరణ వ్యవహారం రాబోయే రోజుల్లో ఎలాంటి రాజకీయ మలుపులు తీసుకుంటుందో చూడాలి.

## వెనిజులా భూకంపంలో షాకింగ్ నిజాలు 51 వేల మంది మిస్సింగ్!

మొదటి పేజీ తరువాయి



భూకంపం అనంతరం అక్కడి దృశ్యాలు అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తుండగా.. ఓ షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. కూలిపోయిన ఇళ్లు, భారీ అపార్ట్‌మెంట్ల శిథిలాల క్రింద చిక్కుకుని ఏకంగా 51,000 మందికి పైగా ప్రజలు గల్లంతైనట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు వెల్లడించాయి.

ప్రస్తుతం భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. వందలాది విపత్తు నిర్వహణ బృందాలు, రెస్క్యూ టీమ్స్ రాత్రింబవళ్లు శ్రమిస్తూ అత్యాధునిక పరికరాల సహాయంతో కూలిపోయిన కాంక్రీట్ కట్టడాల శిథిలాలను తొలగిస్తున్నారు. సమయం గడుస్తున్న కొద్దీ శిథిలాల క్రింద చిక్కుకున్న వారు ప్రాణాలతో బయటపడే అవకాశాలు క్షీణిస్తుండటంతో బాధితుల కుటుంబాలలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మరణాల సంఖ్య ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉందని, క్షతగాత్రులకు తాత్కాలిక శిబిరాల్లో అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నామని స్థానిక అధికారులు పేర్కొన్నారు.

## కలపడం తప్ప.. విడగొట్టడం రాదు కుల రాజకీయాలపై పవన్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

అసలు కులాలతో రాజకీయాలే చేయనని, ఎప్పటికీ చేయబోనని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అన్ని కులాలను కలుపుని ముందుకు వెళ్తానని, అప్పుడే మనుగడ ఉంటుందని తెలిపారు. రాజకీయాల్లో కుల ప్రస్తావన ఉండకూడదని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

పిల్లలందరికీ ఒకే హాస్టల్ ఉండాలి..

ఎస్టీ, ఎస్సీ, బీసీల పేరుతో దేశంలో ఎక్కడా కూడా హాస్టళ్లు ఉండకూడదని, పిల్లలందరికీ ఒకటే ఉండాలని పవన్ ఆకాంక్షించారు. పార్టీలో 18 వేల మంది సాధక్‌లు ఉన్నారని, పార్టీకోసం పని చేసేవారికి మాత్రమే పదవులు దక్కుతాయని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పని చేసే కార్యకర్తను గుర్తిస్తామన్నారు. పార్టీ పరిస్థితిపై ఎప్పటికప్పుడు పారదర్శకంగా సమాచారాన్ని అందించడమే కమిటీ బాధ్యత అని చెప్పారు. కమిటీల ఎంపికపై విమర్శలు సరికాదన్నారు. కమిటీలు సేకరించిన సమాచారాన్ని వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జనసేన కోసం నిస్వార్థంగా పని చేసిన వారికి తగిన గుర్తింపు ఇస్తామని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాల కోసం పని చేస్తే మరిన్ని పదవులు ఇస్తామని పవన్ కళ్యాణ్ తెలిపారు.

## ఆ ప్రచారం నమ్మొద్దు.. ఆర్టీసీ హామీలపై మంత్రి పొన్నం కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి



దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తు చేశారు.

అందుకే యూనియన్ ఎన్నికలు:

సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడిల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు.

ఏపీలో మాదిరిగా కాకూడదనే:

ఇందులో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే ప్రక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీలో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన ప్రక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మాట మీద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన ప్రక్రియ గురించి భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీలో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుందని దీనిని కార్మికులంతా గమనించాలన్నారు.

## వారి త్యాగం చిరస్మరణీయం పునరావాసం కల్పిస్తాం: సీఎం చంద్రబాబు



**న్యూస్ డెస్క్, 27 జూన్ (ఇది కద నిజం):** వెలిగొండ ప్రాజెక్టు బాధిత రైతులకు పునరావాసం కల్పిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. మార్కాపురం జిల్లా గంటవానిపల్లెలో వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులను ఆయన పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ అభివృద్ధి కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగం చిరస్మరణీయమని కొనియాడారు. తరతరాలుగా సాగు చేస్తున్న భూములను త్యాగం చేశారని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు నాలుగు జిల్లాల భవిష్యత్తును మార్చబోతోందని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. మార్కాపురానికి నీళ్లు ఇవ్వాలని నందమూరి తారకరామారావు చాలా ఆలోచించారని, ఈ ప్రాంతానికి ఎప్పుడు వచ్చినా వెలిగొండ గురించే అడిగేవారని చంద్రబాబు గుర్తు చేశారు. మార్కాపురమంటేనే కరువు ప్రాంతమని, ఇక్కడికి కృష్ణా జలాలు వస్తాయనే ఊహ కూడా ఉండేదనికాదన్నారు. 1996లో తానే వెలిగొండకు పునాది వేశానని, పునరావాసానికి రూ.300 కోట్లు అందజేశామని చంద్రబాబు నాయుడు తెలిపారు.

## 'స్మార్ట్ కిచెన్' పేరుతో మధ్యాహ్న భోజన కార్మికుల పొట్ట కొడుతున్నారు: వైఎస్ జగన్



**న్యూస్ డెస్క్, 27 జూన్ (ఇది కద నిజం):** కూటమి ప్రభుత్వం 'స్మార్ట్ కిచెన్' పేరుతో మధ్యాహ్న భోజన కార్మికుల పొట్టకొడుతున్నారని మాజీ సీఎం జగన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. అందులో "ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండుతున్న దాదాపు 85 వేల మంది మహిళా కార్మికుల జీవితాలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెలగాటం ఆడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

సోషల్ మీడియా వేదికగా కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడిన ఆయన.. రాష్ట్రంలో 'స్మార్ట్ కిచెన్స్' పేరుతో సరికొత్త విధానాన్ని తీసుకువస్తూ, గత 20 ఏళ్లకు పైబడి పాఠశాలల్లోనే నమ్ముకుని పనిచేస్తున్న నిరుపేద మహిళలను రోడ్డున పడేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. స్మార్ట్ కిచెన్స్ పేరిట తమ సొంత పార్టీ నాయకులకు, అనుచరులకు కాంట్రాక్టులు ఇస్తూ వారి పొట్టలు నింపేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించిన జగన్.. ఇందులో భాగంగానే వీరికి అందాల్సిన గత రెండు నెలల జీతాలను కూడా ప్రభుత్వం బకాయిలు పెట్టడం దారుణమన్నారు.

గతంలో మధ్యాహ్న భోజన కార్మికులకు కేవలం రూ. 1,000 ఉన్న గౌరవ వేతనాన్ని తాము అధికారంలోకి రాగానే రూ. 3,000కు పెంచామని వైఎస్ జగన్ గుర్తు చేశారు. ఎన్నికల ప్రచార సమయంలో ఈ మహిళా కార్మికులకు ఇంకా మేలు చేస్తామని, జీతాలు పెంచుతామని నమ్మబలికిన చంద్రబాబు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వారి జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ మధ్యాహ్న భోజన కార్మికుల పక్షాన నిలబడుతుందని, వారి హక్కుల కోసం గట్టిగా పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గత రెండు నెలలుగా బకాయి పెట్టిన వేతనాలను విడుదల చేయాలని, అలాగే ఎన్నికల హామీ మేరకు వారి జీతాలను తక్షణమే పెంచాలని వైఎస్ జగన్ గట్టిగా డిమాండ్ చేశారు.

## మోడీ ప్రభుత్వంపై సోనియా గాంధీ తీవ్ర విమర్శలు

**న్యూస్ డెస్క్, 27 జూన్ (ఇది కద నిజం):** కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. గాజాలో జరుగుతున్న 'నరమేధం' పై మోడీ ప్రభుత్వం వహిస్తున్న 'రాయి లాంటి నిశ్శబ్దం', నిష్క్రియ విధానం కేవలం నైతికంగా ఖండించదగినది మాత్రమే కాదని.. దేశ ప్రయోజనాల దృష్ట్యా కూడా దానికి ఎలాంటి హేతుబద్ధమైన కారణం లేదని ఆమె మండిపడ్డారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికకు రాసిన ఒక ప్రత్యేక కథనంలో సోనియా గాంధీ భారత విదేశాంగ విధానంలోని లోపాలను గట్టిగా ఎండగట్టారు.



ఇజ్రాయెల్‌కు కేంద్రం ఇస్తున్న మద్దతు వల్ల పాలిస్తీనా, ఇరాన్, మధ్యప్రాచ్య దేశాల వంటి భారతదేశ చారిత్రాత్మక మిత్రదేశాలకు మనం దూరమయ్యామని సోనియా ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ ప్రపంచ ప్రజాభిప్రాయానికి భిన్నంగా నడుచుకుంటోందని.. ఈ శూన్యతను ఆసరాగా చేసుకుని పాకిస్తాన్ మధ్యవర్తిగా చొరబడేందుకు మోడీ ప్రభుత్వమే అవకాశం కల్పించిందని ఆమె విమర్శించారు. అంతేకాకుండా, అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడికి దిగడానికి కొద్ది రోజుల ముందు.. ప్రధాని నరేంద్ర మోడీ ఇజ్రాయెల్‌లో పర్యటించడం అత్యంత 'భ్రమ కలిగించే వ్యూహాత్మక నిర్ణయం' అని సోనియా గాంధీ అభివర్ణించారు.

## ఉపాధి చట్టంపై తెలంగాణ నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల భవిష్యత్తును తాకట్టు పెట్టే చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం తలవంచి అమలు చేయదు. ప్రజల ప్రయోజనాలే మాకు పరమావధి అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టంలోని అనేక నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని న్యాయ నిపుణులు ఉపసంఘానికి వివరించారని తెలిపారు. అవసరమైతే ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని చెప్పారు. రాష్ట్రాల హక్కులను కాపాడేందుకు అవసరమైతే దేశ అత్యున్నత న్యాయస్థానం తలుపులు తడతామన్నారు. తెలంగాణ ఒక్కటే కాదు... సమాఖ్య వ్యవస్థను విశ్వసించే ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

తెలంగాణకు ప్రత్యేక చట్టం:

కర్ణాటక, కేరళ ముఖ్యమంత్రులతో సంప్రదింపులు జరిపి, ఉమ్మడి న్యాయపరమైన, రాజకీయ కార్యాచరణపై చర్చించాలని ఉపసంఘం నిర్ణయించినట్లు వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న దాదాపు 20 పౌరసంఘాలు కేంద్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం స్వంత ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని వారు సూచించారని తెలిపారు. 60 రోజుల ఉపాధి పరిమితిని పూర్తిగా వ్యతిరేకిస్తూ, ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల హామీ ఉపాధి కల్పించాలని, చట్టబద్ధ కనీస వేతనాలు చెల్లించాలని పౌరసంఘాలు ప్రభుత్వాన్ని కోరాయని మంత్రి వివరించారు. కేంద్రం ప్రతిపాదించిన 60:40 నిధుల భాగస్వామ్య విధానం తెలంగాణపై వేల కోట్ల రూపాయల అదనపు భారం మోపే ప్రమాదం ఉందని, ఈ అంశాన్ని రాష్ట్ర న్యాయశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. పనితీరు బాగున్న రాష్ట్రాలను శిక్షిస్తూ, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించేలా కేంద్రం రూపొందించిన నిధుల కేటాయింపు విధానం అన్యాయమని మంత్రి విమర్శించారు.

జూలై2 న కేబినెట్‌లో కీలక నిర్ణయం:

ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి సమగ్ర సూచనలు పంపినా వాటిని పూర్తిగా విస్మరించడం బాధాకరమని అన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, రాష్ట్ర రాజ్యాంగబద్ధ అధికారాలు, గ్రామీణ పేదల జీవనోపాధిని కాపాడటం మా బాధ్యత. కేంద్రం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే తెలంగాణ చూస్తూ ఊరుకోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంపై జూలై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. అవసరమైతే రాష్ట్ర చట్టం తీసుకురావడం, సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ చేపట్టడం వంటి అన్ని ప్రత్యామ్నాయాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని స్పష్టం చేశారు.

## మహిళా రిజర్వేషన్ల కోసం మహాసభ తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత

మొదటి పేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందినప్పటికీ ఇప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమని కవిత అన్నారు. బిల్లును పోస్ట్ డేటెడ్ చెక్‌లా మార్చారని, అమలులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కొర్రీలు పెడుతోందని విమర్శించారు. బిల్లు అమలుకు దేశవ్యాప్తంగా మహిళల శక్తిని ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైతే హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోనైనా, ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలోనైనా లక్షలాది మహిళలతో భారీ ఉద్యమం చేపడదామని పిలుపునిచ్చారు. మహిళలకు రాజకీయాల్లో నిజమైన సాధికారత రావాలంటే పవర్‌ఫుల్ స్థానాల్లో ఉండే అవకాశాలు కల్పించాల్సిందేనని ఆమె పేర్కొన్నారు.

మహిళలు ఒక స్థాయి వరకు ఎదిగిన తర్వాత వారిని అడ్డుకునే పరిస్థితులు ఇప్పటికీ ఉన్నాయని, అందుకే చట్టబద్ధమైన రిజర్వేషన్లు అత్యవసరమని స్పష్టం చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లు తప్పకుండా సాధిస్తామని, అదే సమయంలో మహిళా నాయకత్వాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు కూడా చేపట్టాలని సూచించారు. 2022--23లో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించామని, అంతేకాకుండా 18 రాజకీయ పార్టీలను ఈ అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడేలా చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచామని కవిత గుర్తుచేశారు. ఆ ఒత్తిడితోనే బిల్లుకు ఆమోదం లభించిందని, అయితే అమలు మాత్రం ఇంకా జరగలేదని అన్నారు. మహిళల ఓట్లు రాజకీయ పార్టీలకు అత్యంత కీలకమని, మహిళల్లో చైతన్యం పెరిగిన నేపథ్యంలో వారిని ఆకర్షించేందుకు ప్రత్యేక పథకాలు ప్రకటిస్తున్నారని కవిత పేర్కొన్నారు. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయని పార్టీలకు ఓట్లు వేయబోమనే ఉద్యమాన్ని మహిళలు ప్రారంభించాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళల కోసం ధైర్యంగా ఒక అడుగు ముందుకేసి పార్టీ పెట్టానని.. మహిళలందరూ గర్వపడేలా, కాలర్ ఎగరేసుకునేలా మంచి రాజకీయాలు చేస్తానని హామీ ఇస్తున్నానని కవిత అన్నారు.

## తెలంగాణ సీఎంవోలో మరో వికెట్ అవుట్.. నిన్న అజిత్ రెడ్డి, నేడు శ్రీనివాస్ రాజు

న్యూస్ డెస్క్, 27 జూన్ (ఇది కద నిజం): తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయంలో (సీఎంఓ) భారీ ప్రక్షాళన కొనసాగుతోంది. పరిపాలనా విభాగంలో గడిచిన రెండు రోజులుగా జరుగుతున్న ఊహించని మార్పులు రాష్ట్ర రాజకీయ, బ్యూరోక్రాటిక్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సీఎంవోలో కీలక అధికారిగా ఉన్న ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ఎస్. శ్రీనివాస్ రాజును ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న శ్రీనివాస్ రాజును తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్ పోస్టుకు బదిలీ చేస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు సీఎంవోలో అత్యంత కీలకమైన మౌలిక వసతులు, ప్రాజెక్టుల వ్యవహారాలను పర్యవేక్షించిన ఆయనను.. అకస్మాత్తుగా 'రెరా' చైర్మన్‌గా నియమించడం వెనుక బలమైన పరిపాలనా పరమైన కారణాలు ఉన్నట్లు సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

నిన్నటివరకు ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా ఉన్నబి. అజిత్ రెడ్డిని ఆ బాధ్యతల నుంచి తొలగించి, మెట్రో రైల్ అదనపు ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఆ వేడి చల్లారక ముందే.. సరిగ్గా మరుసటి రోజే సీఎంవోలో మరో కీలక వికెట్ పడిపోవడం గమనార్హం. శ్రీనివాస్ రాజు వంటి సీనియర్ అధికారిని సీఎం కార్యాలయం నుంచి లూప్ లైన్ లాంటి 'రెరా'కు పంపడం బ్యూరోక్రాటిక్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వరుసగా జరుగుతున్న ఈ బదిలీలు, బాధ్యతల మార్పులను గమనిస్తే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కార్యాలయాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడ్డట్లు స్పష్టమవుతోంది. రాబోయే రోజుల్లో సీఎంవోలో మరికొన్ని కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని, ఇదంతా ఒక వ్యూహం ప్రకారమే జరుగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వరుస పరిణామాలు సచివాలయ వర్గాల్లో పెను సంచలనానికి దారితీశాయి.

## సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో కీలక పరిణామం

### సిట్ అదుపులో సీఐ మిత్రుడు సురేష్.. పరారీలో పోలీసులు!

**న్యూస్ డెస్క్, 27 జూన్ (ఇది కద నిజం):** రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన విజయవాడ (కృష్ణలంక రాజీవ్‌నగర్) రౌడీషీటర్ గాదె సాయికృష్ణ అలియాస్ పిల్ల సాయి కస్టోడియల్ డెత్ వ్యవహారంపై సిట్ విచారణ వేగవంతమైంది. ఈ కేసులో కీలక పరిణామంగా.. పరారీలో ఉన్న సీఐ నాగరాజు స్నేహితుడు సురేష్‌ను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం అతడిని ఓ రహస్య ప్రదేశంలో విచారిస్తూ కీలక సమాచారాన్ని రాబడుతున్నట్లు అధికార వర్గాల సమాచారం.

సురేష్ పాత్రపై ముమ్మర విచారణ..


సాయికృష్ణ లాకప్ డెత్ అనంతరం మృతదేహాన్ని మాయం చేయడంలోనూ, ఆ తర్వాత కుటుంబ సభ్యులతో రాజీకి రాయబారం నడపడంలోనూ సీఐ నాగరాజుకు సురేష్ పూర్తిగా సహకరించినట్లు సిట్ అధికారులు గుర్తించారు. పోలీసుల విధుల్లో సురేష్ జోక్యం, నాగరాజుతో అతడికున్న సంబంధాలు, లాకప్ డెత్ తర్వాత జరిగిన పరిణామాలపై సిట్ బృందం అతడిని లోతుగా ప్రశ్నిస్తోంది.

పరారీలో ఉన్న పోలీసుల కోసం గాలింపు..

ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ పరారీలో ఉన్న హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, జంగం నానిల కోసం సెంట్రల్ డివిజన్ టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. వీరి కోసం ఈ బృందాలు ఇప్పటికే హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు వెళ్లాయి. నిందితుల ఇళ్లకు నోటీసులు అంటించిన సిట్ అధికారులు.. తక్షణమే విచారణకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు.

ఉన్నతాధికారులతో సిట్ భేటీ

ఈ ఘటనలో మరికొందరి పాత్రపై అనుమానాలు



ఉండటంతో సిట్ అధికారులు డీసీపీ కృష్ణకాంత్ పటేల్, టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ లతా కుమారి, ఏసీపీ మానసలతో వేర్వేరుగా సమావేశమై వివరాలు సేకరించారు. మరోవైపు, మృతుడు సాయి కృష్ణ నేర చరిత్రపై కూడా దర్యాప్తు బృందం దృష్టి సారించింది. గత నెలలో సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు రావడం, ఈ కేసు రోజుకో మలుపు తిరుగుతుండటంతో సిట్ దర్యాప్తు ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇది కద నిజం
ఆదివారం 28-06-2026

# ఓటర్ల ఎన్యూమరేషన్ గడువును 60 రోజులకు పెంచాలి

## సీఈఓ సుదర్శన్ రెడ్డికి టీపీసీసీ కమిటీ వినతి



ఇది కద నిజం, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఎలక్షన్ కమిషన్ ప్రారంభించిన ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందించడంలో జరుగుతున్న జాప్యంపై టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ స్పందించింది. శనివారం కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్ నేతృత్వంలో, సభ్యులు గోపిశెట్టి రాఘవేందర్, డాక్టర్ బైకినీ లింగం యాదవ్‌లతో కూడిన ప్రతినిధి బృందం రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రాల్ ఆఫీసర్ సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా వారు రాష్ట్రంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ఆలస్యమవుతున్న తీరును సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బీఎల్‌ఓలుగా విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు పల్స్ పోలియో కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నందున, మరో మూడు రోజుల పాటు ఈ ప్రక్రియకు ఆటంకం కలిగే అవకాశం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల ఎన్యూమరేషన్ గడువును ప్రస్తుతమున్న 30 రోజుల నుండి 60 రోజులకు పెంచాలని వారు చీఫ్ ఎలక్ట్రాల్ ఆఫీసర్‌ను కోరారు. అదేవిధంగా, రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితా ఇంకా బీఎల్‌ఓలకు అందలేదని, తక్షణమే ఆయా జాబితాలను వారికి చేరవేసేలా చర్యలు తీసుకోవాలని కమిటీ విజ్ఞప్తి చేసింది. టీపీసీసీ నేతల వినతిపై సానుకూలంగా స్పందించిన సీఈఓ సుదర్శన్ రెడ్డి.. గడువు పెంపు అంశాన్ని కేంద్ర ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అలాగే బూత్ లెవెల్‌లో జరుగుతున్న జాప్యంతో పాటు ఇతర ఎన్నికల ప్రక్రియలపై డి.ఇ.ఓ లు, ఈ.ఆర్.ఓ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేసేలా తగిన దిశానిర్దేశం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# సిద్దాపూర్ కుంటలో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూన్ 27: కామారెడ్డి జిల్లాపిట్లం మండలం చిల్లర్గి గ్రామానికి చెందిన బుట్ట గంగా బోయి (58) సిద్దాపూర్ గ్రామ శివారులోని రంగయ్య చెరువు కుంటలో మృతిచెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, గంగా బోయి ఈ నెల 24న చేపల వేటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టగా, సిద్దాపూర్ గ్రామ శివారులోని కుంటలో చేపలు పడుతూ ప్రమాదవశాత్తు నీటిలో బోర్లాపడి ఊపిరాడక మృతి చెందినట్లు గ్రామస్తులు గుర్తించారు. అప్పటికే మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉన్నట్లు తెలిపారు. మృతుడి భార్య బుట్ట గంగామణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పిట్లం ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

# తిమ్మానగర్ రోడ్డులో ప్రమాదం పొంచి ఉంది వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి





ఇది కద నిజం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూన్ 27: పిట్లం పట్టణ కేంద్రంలోని తిమ్మానగర్ రోడ్డులో కరెంట్ కార్యాలయం ఎదుట రహదారి దెబ్బతినడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. రోడ్డులో ఏర్పడిన గుంత కారణంగా ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెల రోజుల వ్యవధిలో ఇదే ప్రాంతంలో రెండు నుంచి మూడు కార్లు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాయని స్థానికులు తెలిపారు. వర్షాల కారణంగా గుంత మరింత ప్రమాదకరంగా మారిందని, రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వారికి ప్రమాదం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పిట్లంలో అంగరంగ వైభవంగా గాజుల పీర్ జాతర మహోత్సవం

## గ్రామ ప్రధాన వీధుల గుండా కన్నుల పండువగా ఊరేగింపు పోటెత్తిన భక్తజనం



ఇది కద నిజం:కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా మరియు పిట్లం మండల వ్యాప్తంగా పిట్లం మండల కేంద్రంలోని గాజుల పీర్ మక్కీ వర్ద్ షరీఫ్ దర్గా జాతర మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. మహోత్సవంలో భాగంగా పీర్‌ను గ్రామ ప్రధాన వీధుల గుండా ఘనంగా ఊరేగించగా, వేలాదిగా తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంలో పాల్గొన్నారు. ఊరేగింపు సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడగా, భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా దర్గా ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులకు నిర్వాహకులు షర్బత్, పంచి సంప్రదాయాలు, ఆధ్యాత్మికత, భక్తి ఉత్సాహం మేళవించిన ఈ జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా సాగి అందరినీ ఆకట్టుకుంది.

# లాల్ దర్వాజా మహంకాళి ఆలయంలో ఘనంగా నక్షత్ర హారతి



ఇది కద నిజం,హైదరాబాద్: చారిత్రాత్మక లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయంలో శుక్రవారం రాత్రి అమ్మవారికి నక్షత్ర హారతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ నూతన చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జి. అరవింద్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పి. సతీష్ ముధిరాజ్, కోశాధికారి జి. హరినాథ్ గౌడ్ సారథ్యంలో ఈ పూజలు ఘనంగా జరిగాయి. హారతి కమిటీ సభ్యులు ఎ. రణదీశ్వర్ గౌడ్, జి. మణికంఠేష్ గౌడ్, ఎస్. దశరథ్ లాల్, ఎ. భరత్ కుమార్, ఎ. యశ్వంత్, జె. రాజేష్ గౌడ్ ఈ కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షించారు. గత శుక్రవారం నుండి ఆలయంలో కొత్తగా ప్రారంభమైన ఈ నక్షత్ర హారతి విశేష పూజలు.. ప్రతి శుక్రవారం రాత్రి 8:30 గంటలకు శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. ఈ వారం జరిగిన ప్రత్యేక హారతిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కనులపండువగా జరిగిన ఈ హారతి సేవలో పాల్గొని భక్తులు అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జి. అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం రాత్రి అమ్మవారికి ఈ నక్షత్ర హారతి కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. భక్తులు, ముత్తైదువులు ప్రతి వారం ఈ విశేష పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని ఆయన కోరారు.

# రూట్ మ్యాప్ ఆధారంగా జీరో డోస్ పిల్లల గుర్తింపు కార్యక్రమం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 0--5 సంవత్సరాల వయస్సు గల 4,526 మంది చిన్నారులను లక్ష్యంగా రూట్ మ్యాప్ ఆధారంగా ప్రత్యేక సర్వే చేపట్టారు. నాలుగు రూట్లలో ఒక మొబైల్ బృందంతో పాటు బస్టాండ్ ట్రాన్సిట్ పాయింట్‌లో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 38 బూత్‌ల పరిధిలో జీరో డోస్ పిల్లలను గుర్తించి టీకాలు అందించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌వోలు, వాలంటీర్లు పాల్గొన్నారు. డాక్టర్ పూజ, డాక్టర్ అరుణ సిబ్బందికి అవసరమైన సూచనలు అందించారు.

# కంబాపూర్‌లో మహిళా సభ నిర్వహణ



ఇది కద నిజం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూన్ 26: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కంబాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం మహిళా సభను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మహిళల సంక్షేమం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మహిళలు గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బైక్ దొంగల ముఠా అరెస్ట్



చందానగర్, జూన్ 27: గోపనపల్లిలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను చందానగర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి దొంగిలించబడిన మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులలో ఒకరు అదే ప్రాంతంలో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండటం గమనార్హం.పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 25న గోపనపల్లిలోని 'అనర్ వివాంటిస్' అపార్ట్‌మెంట్ పార్కింగ్ స్థలంలో పార్క్ చేసిన తమ బైక్‌లు చోరీకి గురయ్యాయని బాధితులు చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి, బోరబండకు చెందిన సెక్యూరిటీ సూపర్‌వైజర్ కె. వెంకటరమణను ప్రధాన నిందితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడు దొంగిలించిన బైక్‌లను కొనుగోలు చేసిన స్క్రాప్ వ్యాపారులు బి. వెంకటేష్ (చందానగర్), మహమ్మద్ యూసుఫుద్దీన్ (ముషీరాబాద్), కె. చిన్న నరసింహులు (గోపనపల్లి)లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని డిసిపి సిహెచ్. శ్రీనివాస్ , అడిషనల్ డిసిపి ఎన్. ఉదయ్ రెడ్డి, ఏసిపి శ్రీనివాస్ కుమార్ ల పర్యవేక్షణలో చందానగర్ ఇన్‌స్పెక్టర్ బృందం ఈ కేసును చాకచక్యంగా చేధించింది. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు తప్పనిసరిగా సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, గుర్తింపు పొందిన సంస్థల నుంచే నమ్మకమైన సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని కోరారు. అలాగే వాహనదారులు తమ వాహనాలకు సరైన లాకింగ్ సిస్టమ్ ఉపయోగించాలని సూచించారు.

# ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్



ఇది కద నిజం: తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా దేశ రాజధాని ఢిల్లీలో లాల్ దర్వాజా బోనాల ఉత్సవాలను జూలై 20, 21, 22 తేదీలలో మూడురోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నామని లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయం కమిటీ చైర్మన్ జి.అరవింద్ కుమార్ గౌడ్ తెలిపారు. ఢిల్లీలో నిర్వహించే బోనాల ఉత్సవాల కోసం రూపొందించిన ఆహ్వాన పత్రికను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మినిస్టర్ పొన్నం ప్రభాకర్ శనివారం బంజారాహిల్స్ మినిస్టర్స్ క్వార్టర్ లోని ఆయన నివాసంలో ఆలయ కమిటీ చైర్మన్ అరవింద్ కుమార్ గౌడ్ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని దేశవ్యాప్తం చేసే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.అందులో భాగంగానే ఢిల్లీలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు జి.కాశీనాథ్ గౌడ్, కె.వెంకటేష్, ఎ. బద్రినాథ్ గౌడ్, పోసాని సురేందర్ ముదిరాజ్, కమిటీ ప్రధాన కార్యదర్శి పోసాని సతీష్ ముదిరాజ్, కోశాధికారి జి.హరీష్ గౌడ్, కమిటీ ప్రతినిధులు రంగ హరినాథ్ గౌడ్,రంగ శ్రీకాంత్ గౌడ్, ఎ. భరత్ కుమార్, దశరథ్ సప్నేకర్, జి.హరీష్ గౌడ్, జి.మణికంటేష్ గౌడ్, ఎ. యశ్వంత్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు దుసరి నర్సింహ గౌడ్, దుర్గేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


# పిట్లంలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ సర్వే



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూన్ 27: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సర్వే కొనసాగుతోంది. ఓటరు జాబితాను పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించే లక్ష్యంతో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్ల సవరణ, మరణించిన వారి వివరాల నమోదు వంటి ప్రక్రియలు నిర్వహిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ అవసరమైన పత్రాలతో సహకరించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# హైదర్ గూడా పోచమ్మ ఆలయ వీధిలో డ్రైనేజీ ముప్పును తప్పించండి!

## యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టండి




ఇది కద నిజం, అత్తాపూర్: హైదర్‌గూడ పోచమ్మ ఆలయం సమీపంలో గత 20 రోజులుగా రోడ్లపై మురుగునీరు పారుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై పారుతున్న నల్లటి మురుగునీరు సరిగ్గా తాగునీటి పైపుల వాల్వ్ గుంతల్లోకి చేరుతోంది. ఈ మురుగునీరు తాగునీటిలో కలవడం వల్ల నీరు కలుషితమై, ప్రజలు వాడటానికి వీలు లేకుండా తయారైంది. ఈ కలుషిత నీటి వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మురుగు సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసినప్పుడు కార్మికులు వచ్చి నీటిని తోడేస్తున్నప్పటికీ, వెంటనే పరిస్థితి మళ్ళీ మొదటికి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక పరిష్కారాలు కాకుండా, శాశ్వత పరిష్కారం చూపాలని వారు అధికారులను కోరుతున్నారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# నేడు పల్స్ పోలియో...

## పోలియో రహిత జీవితం కోసం 2చుక్కలు



నల్లగొండ (ఇది కద నిజం): దేశవ్యాప్తంగా రేపు జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమానికి సూర్యాపేట జిల్లాలో అన్ని రకాల ఏర్పాట్లు చేసామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ తెలిపారు.. జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులను 95వేల మంది కి పోలియో చుక్కలు వేసేందుకు 575 పోలియో కేంద్రాలు 11 ట్రాన్సిట్ కేంద్రాలు, 103హైరిస్క్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. 28వ తేదీన ఏర్పాటు చేసిన భూతులలో పోలియో చుక్కలు వేసి 29 30 తేదీలలో ఇంటింటి సర్వే చేసి ఇంటి వద్దనే పోలియో చుక్కలు వేస్తామని వివరించారు.. ప్రతి చిన్నారి పోలియో రహిత జీవితం పొందేందుకు తల్లిదండ్రులు , స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విధిగా తమ ప్రాంతాలలో ఉన్న ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలనీ విజ్ఞప్తి చేశారు.....

# సినిమా న్యూస్

## ఆ తేదీన 'ఫౌజీ' గ్లింప్స్




రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఫౌజీ' చిత్రంలో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ఇమాన్వి ఇస్మాయిల్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమై ఇప్పటికే చాలా కాలం కాగా, చిత్రీకరణ కూడా దాదాపు పూర్తయినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్లు మినహా ఎలాంటి కీలక అప్డేట్లను మేకర్స్ విడుదల చేయలేదు. అలాగే విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఈ సినిమా రిలీజ్ డేట్‌పై అనేక రూమర్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ ఏడాది ఆగస్టు 15న ఈ చిత్రం నుంచి గ్లింప్స్ వీడియోను విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు, అదే రోజున విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని టాలీవుడ్ వర్గాల్లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే ఆ అంచనాలు మరింత పెరిగే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.

## మహేష్ ట్రిపుల్ ట్రీట్



సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం 'వారణాసి' చిత్రంలో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో ఆయన బిజీగా ఉన్నారు. అయితే ఈ సినిమాతో పాటు మరో రెండు సినిమాల ప్రమోషన్లలో కూడా మహేష్ పాల్గొననున్నట్లు సమాచారం. మహేష్ బాబు సోదరుడు రమేష్ బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా వెండితెరకు పరిచయం కానున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం జూలై 9న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను జూలై తొలి వారంలో నిర్వహించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి మహేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై తన సోదరుడి కుమారుడు జయకృష్ణను ప్రోత్సహించనున్నట్లు టాక్ వినిపిస్తోంది.

ఇక మహేష్ బాబు, సత్యదేవ్ హీరోగా వెంకటేష్ మహా దర్శకత్వంలో తెరకెక్కిన 'రావు బహదూర్' చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా జూలై 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా చూసిన మహేష్, సోషల్ మీడియా వేదికగా మూవీపై ప్రశంసలు కురిపించగా ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. అలాగే సినిమా విడుదలకు ముందు 'రావు బహదూర్' ప్రమోషన్లలో భాగంగా ఒకటి లేదా రెండు ఇంటర్వ్యూలలో కూడా మహేష్ పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో ఒకవైపు 'వారణాసి' షూటింగ్, మరోవైపు 'శ్రీనివాస మంగాపురం' ప్రీ రిలీజ్ ఈవెంట్, అలాగే 'రావు బహదూర్' ప్రమోషన్లతో మహేష్ బాబు ఏకకాలంలో మూడు సినిమాల పనులతో బిజీగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ వార్తతో ఆయన అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

## దిల్ రాజు భారీ ప్లాన్



చాలా సంవత్సరాల క్రితం అల్లు అర్జున్ హీరోగా, సుకుమార్ దర్శకత్వంలో, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మించిన 'ఆర్య' భారీ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాతో అల్లు అర్జున్, సుకుమార్, దిల్ రాజు ముగ్గురికీ విశేషమైన గుర్తింపు లభించింది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ క్రేజీ వార్త సినీ వర్గాల్లో వైరల్ అవుతోంది. 'ఆర్య' చిత్రాన్ని పూర్తి స్థాయి యానిమేటెడ్ మూవీగా రూపొందించేందుకు దిల్ రాజు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు కూడా సుకుమార్ దర్శకత్వం వహించే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

బడ్జెట్ విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ యానిమేటెడ్ చిత్రాన్ని రూపొందించేలా నిర్మాత ప్లానింగ్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం దిల్ రాజు పలు సినిమాల నిర్మాణంలో బిజీగా ఉండగా, సుకుమార్ త్వరలో రామ్ చరణ్‌తో కొత్త సినిమాను ప్రారంభించనున్నాడు. మరి నిజంగానే 'ఆర్య'ను పూర్తి స్థాయి యానిమేటెడ్ మూవీగా తెరకెక్కిస్తారా? లేక ఇవన్నీ కేవలం ప్రచారానికే పరిమితమవుతాయా? అనేది ప్రస్తుతం ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చగా మారింది.

## మ్యూజికల్ జర్నీ షురూ

మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. గత కొద్దికాలంగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో, ఈసారి ఎలాగైనా ఒక భారీ కంబ్యాక్ హిట్ అందుకోవాలనే పట్టుదలతో ఆయన తన లేటెస్ట్ మూవీ 'ఇరుముడి' కోసం తెగ కష్టపడుతున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో ఫ్యామిలీ అండ్ ఎమోషనల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి మూవీ మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తోంది.

అలాగే చైల్డ్ ఆర్టిస్ట్ బేబీ నక్షత్ర ఈ చిత్రంలో రవితేజ కూతురి పాత్రలో కనిపించబోతుండగా, సీనియర్ నటుడు సాయి కుమార్ ఒక కీలక పాత్రను పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ బ్యానర్లపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. అయితే రిలీజ్ తేదీ దగ్గర పడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. ఇందులో భాగంగానే మ్యూజికల్ జర్నీని ప్రారంభించారు. మొదటి పాట విడుదల తేదీని ప్రకటించారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్ 'ఇరుముడి కట్టు' అని సాగే ఈ పాటను జూన్ 29న ఉదయం 11:07గంటలకు విడుదల చేయబోతున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా రవితేజ అయ్యప్ప స్వామి మాలలో పూజ చేస్తున్న పోస్టర్‌ను షేర్ చేసి ఆసక్తిని రేకెత్తించారు. రవితేజను ఇలాంటి భక్తిరస పాత్రలో చూడటం ఫ్యాన్స్‌కు సరికొత్త అనుభూతిని ఇస్తోంది.




## 'మా ఇంటి బంగారం 2'

సమంత తాజాగా 'మా ఇంటి బంగారం' చిత్రంలో ప్రధాన పాత్రలో నటించిన విషయం తెలిసిందే. నందిని రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని సమంతతో పాటు రాజ్ నిడిమోరు సంయుక్తంగా నిర్మించారు. ప్రారంభం నుంచే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. విడుదలైన తర్వాత కూడా ప్రేక్షకులను ఆకట్టుకుని ఈ చిత్రం అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని రాత్రి చిత్రబృందం సక్సెస్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా రాజ్ నిడిమోరు మాట్లాడుతూ.. 'మా ఇంటి బంగారం' చిత్రానికి ప్రేక్షకులు అందించిన ఆదరణకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ప్రేక్షకుల స్పందన, వారి ఆనందాన్ని చూస్తుంటే ఈ సినిమాకు సీక్వెల్ చేయాలనే ఆలోచన వచ్చిందని వెల్లడించారు. ఇప్పటికే సీక్వెల్‌కు సంబంధించిన ఓ ఐడియా కూడా సిద్ధంగా ఉందని, ఈ విషయాన్ని ఇప్పటివరకు ఎవరికీ చెప్పలేదని అన్నారు. మరో రెండు సంవత్సరాల్లో 'మా ఇంటి బంగారం 2' ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం సమంత గర్భవతిగా ఉన్న విషయం తెలిసిందే. కొంతకాలం పాటు సినిమాలకు విరామం తీసుకోనున్నట్లు ఆమె ఇప్పటికే వెల్లడించింది. దీంతో ఆమె తిరిగి సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చిన అనంతరం 'మా ఇంటి బంగారం 2' షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

